ఆర్జీయూకేటీకి మళ్లీ ఇన్‌ఛార్జి వీసీనే

● వెంకటరమణ బదిలీ ● కొత్త ఉపకులపతికి పరీక్షే

ఈటీవీ-ఆదిలాబాద్, న్యూస్‌టుడే, బాసర(ముథోల్): బాసరలోని రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాని(ఆర్జీయూకేటీ)కి మళ్లీ నిరాశనే ఎదురైంది. శాశ్వత ఉపకులపతి నియామకం కోసం విద్యార్థులు చేస్తున్న పోరాటం ఫలించలేదు. రెండున్నరేళ్లుగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా పనిచేస్తున్న ఆచార్య వెంకటరమణను బుధవారం బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో జేఎన్‌టీయూ హెచ్ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆచార్యుడు ఎ. గోవర్ధన్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించింది. తొలిసారిగా 2010లో శాశ్వత ఉపకులపతిగా నియమితులైన ఖరగ్‌పూర్ విద్యావేత్త రాజ్‌కుమార్ విధి నిర్వహణ 2015 వరకు కొనసాగింది. ఆతరువాత శాశ్వత ఉపకులపతుల నియామకం ఆగిపోయింది. ఇన్‌ఛార్జిల పాలనతోనే నెట్టుకురావాల్సి వస్తోంది. మిగిలిన విశ్వవిద్యాలయాల మాదిరిగానే కులపతిగా గవర్నర్‌ను, ఆయన పర్యవేక్షణలో శాశ్వత ఉపకులపతిని నియమించాలనే విద్యార్థులు ఆందోళనలు చేస్తున్నా ఆ డిమాండ్ నెరవేరలేదు.


ఆర్జీయూకేటీ

సఫలం కాని ప్రయత్నాలు

రెండేళ్ల కిందట శాశ్వత ఉపకులపతి నియామకమే ప్రధాన డిమాండ్‌గా విద్యార్థులు చేసిన నిరవధిక ఆందోళన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించింది. స్పందించిన అప్పటి ప్రభుత్వం విద్యార్థులను శాంతింపచేసేలా తొలుత 2022 జూన్‌లో ఓయూ ఆచార్యుడు సతీష్‌కుమార్ డైరెక్టర్ నియమించింది. విద్యార్థుల ఆందోళన కాస్త సద్దుమణిగాక అదే ఏడాది ఆగస్టులో ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా ఉన్న ఆచార్య వెంకటరమణను ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమించింది. ఉన్నత విద్యామండలి ఉపాధ్యక్షుడిగా, ఇన్‌ఛార్జి ఉపకులపతిగా బాధ్యతల కారణంగా వెంకటరమణ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. పాలకుల పట్టింపులేనితనంతో ఆర్జీయూకేటీలో వ్యవస్థీకృతమైన లోపాలను సరిదిద్ది, విద్యాప్రమాణాలు పెంచటానికి ఆయన చేసిన ప్రయత్నాలు సఫలం కాలేదు. పైగా విశ్వవిద్యాలయం ప్రారంభమైన 2008 నుంచి 2023 జూన్ 13 వరకు 15 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడితే, 2023 జూన్ 15 నుంచి ఈ ఏడాది ఏప్రిల్ వరకు ఆరుగురు ఆత్మహత్యలకు ఒడిగట్టడం అలజడి రేకెత్తించింది. తాజాగా విద్యార్థులు ఆందోళనకు దిగడం ప్రభుత్వ దృష్టికి వెళ్లింది. దాంతో పాటు పదవీ కాలం రెండున్నరేళ్లు పూర్తి కావటంతో వెంకటరమణను బదిలీ చేసిన ప్రభుత్వం గోవర్ధన్‌ను నియమించింది.

సమస్యలు అనేకం

తాజాగా ఇన్‌ఛార్జి ఉపకులపతిగా నియమితులైన ఎ.గోవర్ధన్ బాధ్యతల నిర్వహణ పరీక్షే. సవాలక్ష సమస్యలతో విద్యార్థులు కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. ఇంటర్న్‌షిప్ లేదు. ల్యాప్‌టాప్‌లు, ఆధునిక వసతులు అందుబాటులో లేవు. ఒప్పంద పద్ధతిలో పనిచేస్తున్న 90 మంది అధ్యాపకులు, వంద మంది బోధనేతర సిబ్బంది క్రమబద్ధీకరణ అంశం, శాశ్వత ఉపకులపతి కావాలనే విద్యార్థుల ప్రధాన డిమాండ్ అపరిష్కృతంగా ఉన్నాయి. అక్రమాలకు కేంద్రబిందువుగా మారాయనే మెస్‌ల నిర్వహణ అస్తవ్యస్తంగానే ఉంది. ఒక్కో సమస్యను అధ్యయనం చేయటం, ప్రభుత్వంతో సంప్రదింపులు జరపడం, ఆర్జీయూకేటీలో విద్యావ్యవస్థను గాడిన పెట్టడంలో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ ఏమేరకు సఫలీకృతమవుతారనేది ప్రాధాన్యం సంతరించుకుంటోంది.

నియోజకవర్గానికి రూ.10 కోట్లు విడుదల



పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : సీఆర్ఆర్(గ్రామీణ రోడ్ల నిర్మాణ) గ్రాంట్ల కింద ఆదిలాబాద్ నియోజకవర్గానికి రూ.10 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో భీంసరి వాగుపై రోడ్డు వంతెనకు రూ.3 కోట్లు, జైనథ్ మండలం పార్డి-బి నుంచి మేడిగూడ కెనాల్ రోడ్డుకు రూ.3.50 కోట్లు, ఆదిలాబాద్ గ్రామీణ మండలం రాంపూర్ గ్రామం వార్డు నెం.17 పరిధిలో బీటీ రోడ్డు కోసం రూ.3.50 కోట్లు వెచ్చించనున్నారు. ఈ నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాసరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. త్వరలో మిగిలిన అభివృద్ధి పనులకు రూ.120 కోట్లు విడుదల కానున్నాయని పేర్కొన్నారు.

ప్రాణరక్షణ కేంద్రాలు కావాలి..

● నేడు ప్రపంచ ట్రామా దినోత్సవం

ఉమ్మడి జిల్లాలో ట్రామాకేర్ యూనిట్‌లు అందుబాటులో లేక ప్రమాదాలబారిన పడిన వారి ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి. జాతీయ రహదారులకు సమీపంలో ఉన్న జిల్లా ఆసుపత్రుల్లో ఏర్పాటు చేయాలనుకున్న ట్రామాకేర్ యూనిట్‌లు ప్రతిపాదనదశలోనే మగ్గుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని జాతీయ రహదారి 44, మంచిర్యాల నుంచి కుమురం భీం జిల్లా వాంకిడి మండలం గోయెగాం వరకు ఉన్న 94 కి.మీ.ల 363 నెంబరు రహదారి, నిర్మల్ జిల్లాలో భైంసా వరకు ఉన్న 61వ నెంబరు జాతీయ రహదారులు ప్రమాదకరంగా మారింది. ప్రపంచ ట్రామా దినోత్సవాన్ని పురస్కరించుకొని పరిస్థితులపై 'న్యూస్‌టుడే' కథనం.

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వైద్య విభాగం



ఇదే దిక్కు..

ప్రస్తుతం రిమ్స్‌లో ఉన్న ట్రామా కేర్ యూనిట్ ఇది. ప్రమాదాల బారినపడి ప్రాణాపాయ స్థితిలో వచ్చే బాధితులకోసం ఈ వార్డులో చికిత్సలు అందిస్తున్నారు. శస్త్ర చికిత్సలు అవసరమైతే మాత్రం రెండో అంతస్తులోకి తరలించాల్సి వస్తోంది.



అత్యంత ప్రమాదకరం

గుడిహత్నూర్ మండలం జాతీయ రహదారి-44పై ఉన్న మేకలగండి ప్రాంతం అత్యంత ప్రమాదకరంగా మారింది. ఏడాది కిందట జరిగిన ప్రమాదంలో నలుగురు, ఆ తరువాత చోటు చేసుకున్న ఆటో ప్రమాదంలో మరో ముగ్గురు, ఇటీవల జరిగిన ప్రమాదంలో అయిదుగురు చనిపోయారు.




నిర్మాణంలో క్రిటికల్ కేర్ భవనం

ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారికి వైద్యమందించేందుకు రిమ్స్‌లో ప్రస్తుతం క్రిటికల్ కేర్ భవనం రూ.23.75 కోట్లతో నిర్మిస్తున్నారు. నిర్మాణం పూర్తయ్యాక రూ.11 కోట్లతో అత్యాధునిక యంత్ర పరికరాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు. ఇది త్వరగా పూర్తయితే ప్రాణాపాయ స్థితిలో వచ్చేవారికి ప్రాణప్రదాయినిగా మారనుంది.



మూలమలుపులతో..

మంచిర్యాల జిల్లాలోని జాతీయ రహదారి 363పై తాండూరు మండలంలో బోయపల్లిగేటు వద్ద చోటు చేసుకున్న ఆటో ప్రమాదం ఇది. ట్రామాకేర్‌లు అందుబాటులో లేక మంచిర్యాల ఆసుపత్రిలో చికిత్స అందజేశారు.



ఎందుకంటే!

ప్రపంచ వ్యాప్తంగా రహదారి ప్రమాదాల్లో లక్షల మంది ప్రాణాలు పోగొట్టుకొని వారి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయి. రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించటానికి 2013 నుంచి 'ట్రామా దినోత్సవం' నిర్వహిస్తున్నారు.

ఈ ఏడాది రోడ్డు ప్రమాదాలు (సెప్టెంబరు వరకు)

జిల్లా	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
ఆదిలాబాద్	202	92	154
నిర్మల్	284	111	291
మంచిర్యాల	384	134	325
కుమురంభీం	87	64	172

ప్రతిపాదన దశలోనే..

రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 25 చోట్ల ట్రామా కేర్ కేంద్రాలు ఏర్పాటు చేయటానికి 2022లో అప్పటి ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. జాతీయ రహదారిపై ఎక్కువ ప్రమాదాలు చోటు చేసుకుంటుండటంతో నిర్మల్, ఆదిలాబాద్‌లో వీటిని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. కాని అవి ప్రతిపాదన దశలోనే ఉండిపోయాయి.

ఉమ్మడి జిల్లాల్లో బ్లాక్ స్పాట్లు ఇవే..

◆ **ఆదిలాబాద్ జిల్లాలో** 44వ జాతీయ రహదారిపై జందాపూర్ ఎక్స్‌రోడ్డు, భోరజ్, మావల సమీపంలోని దేవాపూర్ ఎక్స్‌రోడ్డు, గుడిహత్నూర్ మండలం మేకలగండి, ఇచ్చోడ మండలం గాంధీనగర్, నేరడిగొండ మండలం కుప్టి, దూద్‌గండి, కొరటికల్ మూలమలుపు

◆ **మంచిర్యాల** జిల్లాలో ఇందారం, శ్రీరాంపూర్ ఎక్స్ రోడ్డు, సోముగూడెం, రేపల్లెవాడ, తాండూర్ రైల్వే గేటు, బోబెపల్లి బోర్డు ప్రాంతాలు.

◆ **నిర్మల్** జిల్లాలోని 61వ జాతీయ రహదారిపై చిట్యాల, దిలావర్‌పూర్, కల్లూర్, నర్సాపూర్, నసీరాబాద్ ప్రాంతాలు

◆ **కుమురంభీం** జిల్లా గుండా వెళ్లే 363 జాతీయ రహదారిపై వాంకిడి, కాగజ్‌నగర్ ఎక్స్ రోడ్డు, రెబ్బెన గోలేటి, తాండూరు ప్రాంతాల్లో ప్రమాదాలు తరచూ చోటు చేసుకుంటున్నాయి.


ఖాళీగా ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కుర్చీ

మధ్యాహ్నం 12 గంటలకు సారొచ్చారు

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇదీ పరిస్థితి

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : ప్రభుత్వానికి ఆదాయ మార్గమైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు సమయపాలన పాటించకపోవడం ప్రజలకు శాపంగా మారింది. ఆదిలాబాద్‌లోని కార్యాలయంలో ఇద్దరు అధికారుల్లో సబ్ రిజిస్ట్రార్-1 విజయకాంత్‌రావు ఈ నెలాఖరు వరకు సెలవులో ఉన్నారు. సబ్‌రిజిస్ట్రార్-2గా విధులు నిర్వహిస్తున్న ప్రవీణ్ బుధవారం మధ్యాహ్నం 12 గంటల వరకు కార్యాలయానికి రాక రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు ఆవరణలో పడిగాపులు కాశారు. 12 గంటలకు సదరు అధికారి కార్యాలయానికి వచ్చి విధులు నిర్వహించారు. రిజిస్ట్రేషన్ ఆలస్యం వల్ల ప్రజలు రాత్రి వరకు ఉండాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్‌లోని జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయనకు మూడు నెలల కిందట సబ్ రిజిస్ట్రార్ 2గా ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. అలా మూడు నెలల నుంచి ఆయన నిజామాబాద్ నుంచి ప్రతి రోజు రాకపోకలు సాగించడంతోనే రిజిస్ట్రేషన్లు ఆలస్యమవుతున్నాయని ప్రచారం జరుగుతోంది.


అధికారులు రాకపోవడంతో వేచిచూస్తున్న జనం

☛ ఇదే విషయమై ఆయనను సంప్రదించగా తనకు గుండెకు శస్త్రచికిత్స జరగడంతో ఆరోగ్యపరంగా కొన్ని ఇబ్బందులు ఉన్నాయని తెలిపారు. వైద్యుడి వద్దకు వెళ్లి రావడంతో ఆలస్యమైందని, మిగతా రోజుల్లో సమయానికే వచ్చినట్లు వివరించారు.

బకాయిలు వచ్చే వరకు కళాశాలలు బంద్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : బకాయిపడ్డ మూడేళ్ల బోధన రుసుం, ఉపకార వేతనాలు ప్రభుత్వం చెల్లించే వరకు కళాశాలలు తెరవబోమని ఆదిలాబాద్ ప్రైవేటు డిగ్రీ కళాశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. మూడురోజులుగా జిల్లాలోని కళాశాలలు మూసివేసి నిరసన తెలుపుతున్న యాజమాన్యాలు బుధవారం అధ్యాపకులు, విద్యార్థులతో కలిసి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించాయి. ప్రభుత్వ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవిని కలిసి వినతిపత్రం అందజేశారు. సంఘ రాష్ట్ర, జిల్లా కార్యదర్శులు డా.వి.వరప్రసాద్‌రావు, ఉసికెల కార్తిక్, ఆయా కళాశాలల కరస్పాండెంట్లు పున్నారావు, ప్రవీణ్, రాజ్‌కిరణ్, మహ్మద్ బిలాల్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న డిగ్రీ కళాశాలల యాజమాన్య ప్రతినిధులు, అధ్యాపకులు, విద్యార్థులు

కొత్తగా 10 మంది వ్యవసాయాధికారులు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లా వ్యవసాయశాఖలో ఇప్పటి వరకు ఖాళీగా ఉన్న వ్యవసాయాధికారుల పోస్టులు భర్తీ అయ్యాయి. ఇటీవల ఏఓలకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు ఇవ్వడంతో జిల్లాకు పది మందిని కేటాయించారు. వారికి బుధవారం జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌స్వామి ఆధ్వర్యంలో సాంకేతిక అధికారులు శివకుమార్, విశ్వామిత్రలు మండలాలను కేటాయించారు.

పేరు	మండలం
టి.విశ్వనాథ్	కార్యాలయం
జాహ్నవి	"
కె.ఆకాశ్	నార్నూర్
ఆర్.శారద రాణి	సిరికొండ
జె.పూజ	జైనథ్
మహమ్మద్ సాద్	బజార్‌హత్నూర్
ఎల్.రవితేజ	బోథ్
కె.కృష్ణవేణి	నేరడిగొండ
జె.యాకన్న	గాదిగూడ
సాయితేజ	బేల

తీరిన కొరత.. ఫలించిన నిరీక్షణ

కొత్త టీచర్లు 256 మంది



భీంపూర్ అంతర్గాం పాఠశాలకు కొత్తగా వచ్చిన ఇద్దరు టీచర్లు ప్రణయశ్రీ, పూజలు గురువారం విధుల్లో చేరారు. తొలుత ఎంఈవో శ్యాంసుందర్‌కు నియామకపత్రం అందజేసి ఆ తర్వాత స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎంను కలిసి పాఠశాలకు వెళ్లారు. జిల్లా వ్యాప్తంగా స్కూల్‌అసిస్టెంట్లు, ఎస్జీటీ, పీఈటీలు మొత్తం 256 మంది కౌన్సెలింగ్‌లో కేటాయించిన పాఠశాలలకు వెళ్లారు.

232 మంది బదిలీ స్థానాలకు..



జూన్‌లో బదిలీ అయినా రిలీవర్ లేని కారణంగా 232 మంది ఇది వరకు పనిచేసిన పాఠశాలల్లోనే ఉండిపోయారు. కొత్త నియామకాల నేపథ్యంలో వారంతా బదిలీ స్థానాలకు వెళ్లారు. పాతస్థానంలో పనిచేసిన ఎంఈవోల నుంచి రిలీవ్ అయి కొత్త స్థానాల్లో చేరుతున్నట్లు ఆయా మండలాల ఎంఈవోలకు, హెచ్ఎంలకు జాయినింగ్ ఆర్డర్లు ఇచ్చి పాఠశాలల్లో అడుగుపెట్టారు.

న్యూస్‌టుడే, పాలనాప్రాంగణం

డీఎస్సీ-2024 నియామకాలతో ఉపాధ్యాయుల కొరత తీరింది. మరోవైపు బదిలీ అయినా కేటాయించిన పాఠశాలలకు వెళ్లని ఉపాధ్యాయుల నిరీక్షణకు తెరపడింది. బుధవారం కొత్త ఉపాధ్యాయుల రాక... ఇదివరకే పనిచేస్తున్న వారి పోకతో ఆయా పాఠశాలల్లో సందడి కనిపించింది. జిల్లావ్యాప్తంగా కొత్తగా 255 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరగా... మరో 232మంది ఉపాధ్యాయులు బదిలీ స్థానాలకు వెళ్లిపోయారు.

● కొత్త ఉపాధ్యాయుల నియామకం

జిల్లాలో డీఎస్సీ-2024 నియామకాల కౌన్సెలింగ్ మంగళవారం అర్ధరాత్రి వరకు కొనసాగింది. ఆర్డర్ కాపీని చివరి అభ్యర్థి అందుకోవాలంటే అర్ధరాత్రి 2 గంటలైంది. అప్పటివరకు డీఈవో ప్రణీతతో సహా కార్యాలయ ఉద్యోగులు, కౌన్సెలింగ్ బృందాలు శ్రమించాల్సి వచ్చింది. బుధవారం కొత్త పోస్టింగ్‌లు పొందిన అభ్యర్థులు నియామక పత్రాలతో తొలుత ఎంఈవో, ఆ తర్వాత కాంప్లెక్స్ హెచ్ఎంలను కలిసి జాయినింగ్ లెటర్లు ఇవ్వాల్సివచ్చింది. మధ్యాహ్నం తర్వాతే కొత్త టీచర్లు పాఠశాలల్లో అడుగుపెట్టి ప్రధానోపాధ్యాయులను కలిసి తరగతి గదులకు వెళ్లారు. కొత్త టీచర్లను చూడగానే విద్యార్థులు స్వాగతం పలుకుతూ నమస్కరించడం వారిలో సరికొత్త అనుభూతిని కలిగించింది. ఆ సన్నివేశాలను తమ చరవాణుల్లో పదిలపర్చుకున్నారు. మొత్తం 266 మందికి పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వాల్సి ఉన్నా అందులో 10 మందికి వివిధ కారణాలతో పోస్టింగ్‌లు ఇవ్వకుండా నిలిపేశారు. ఉన్నతాధికారుల ఆదేశాలనుసారం వారికి నియామకపత్రాలు ఇవ్వనున్నట్లు డీఈవో తెలిపారు.

ఏళ్ల తర్వాత కొత్త స్థానాలకు

పాత టీచర్లకు 2018 తర్వాత బదిలీలు నిలిచిపోయాయి. మూడు నెలల కిందట జూన్ చివరి వారంలో బదిలీలు జరిగినా.. రిలీవర్ లేక సగంమంది ఉన్నచోటనే పనిచేయాల్సి వచ్చింది. కొత్త నియామకాలతో వారంతా ఏళ్లతర్వాత కొత్తస్థానాలకు వెళ్లారు. మారుమూల ప్రాంతాల్లో పనిచేసిన ఉపాధ్యాయులు కొందరు నివాసాలకు దగ్గర ఉన్న ప్రాంతాల పాఠశాలలకు బదిలీ అయినా.. ఆ సంతోషం తాజా నియామకాలతో సొంతమైంది. జిల్లాలో 232 మంది కొత్త స్థానాల్లో చేరిపోయారు.



ఎమ్మార్సీల వద్ద సందడి

కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులు, బదిలీ అయి రిలీవ్‌కాని టీచర్లతో మండల వనరుల కేంద్రాలు సందడిగా మారాయి. కొత్తగా వచ్చిన టీచర్లతో.. పాత టీచర్ల రీలీవింగ్, జాయినింగ్‌లతో ఎంఈవోలకు బుధవారం తీరిక లేకుండా పోయింది.

నేడు విద్యాసంస్థలకు అధికారిక సెలవు

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : కుమురం భీం వర్ధంతిని పురస్కరించుకుని జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థలకు ఇన్‌ఛార్జి పాలనాధికారి వెంకటేష్ ధోత్రే గురువారం సెలవును ప్రకటించారు. వచ్చే నెల 9వ తేదీ(రెండో శనివారం)ని పని దినంగా పరిగణించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

30 మందిపై అట్రాసిటీ కేసు నమోదు

ఇచ్చోడ, న్యూస్‌టుడే : మండలంలో 30 మందిపై అట్రాసిటీ కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం ముఖరా(కె) గ్రామంలో రెండు కులాలకు చెందిన వారి మధ్య మంగళవారం రాత్రి ఘర్షణ నెలకొంది. ఓ వర్గానికి చెందిన వారు బుధవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఘటనపై విచారణ జరిపిన పోలీసులు 30 మందిపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు.

21న ఐటీఐలో పీఎం శిక్షణ మేళా

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఐటీఐ ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఈ నెల 21న ప్రధానమంత్రి జాతీయ శిక్షణ మేళాను నిర్వహిస్తున్నట్లు ఆదిలాబాద్ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రొడ్డ శ్రీనివాస్ తెలిపారు. ఈ మేళాకు హాజరయ్యేవారు apprenticeship.gov.in పోర్టల్‌లో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 94914 60060 నెంబరును సంప్రదించాలని కోరారు.

ఇందిరమ్మ కమిటీల రగడ

● కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్న విపక్ష ఎమ్మెల్యేలు

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే

సొంతింటి కల నెరవేరేలా గ్రామాల్లో, వార్డుల్లో ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీల నియామకాల్లో రాజకీయం రాజుకుంటోంది. అత్యధిక చోట్ల కాంగ్రెస్ కార్యకర్తల పేర్లతో జాబితా రూపొందించడంతో విపక్ష ఎమ్మెల్యే(భాజపా, భారాస)లు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తాము సూచించిన పేర్లు సైతం జాబితాలో చేర్చాలని పట్టుబడుతున్నారు.

జిల్లాలో ఉన్న 17 గ్రామీణ మండలాల్లో ఆదిలాబాద్ నియోజకవర్గంలో నాలుగు, బోథ్ పరిధిలో తొమ్మిది మండలాలు, ఖానాపూర్‌లో ఉట్నూర్, ఇంద్రవెల్లి రెండు మండలాలు, ఆసిఫాబాద్ నియోజకవర్గ పరిధిలో నార్నూర్, గాదిగూడ రెండు మండలాలు ఉన్నాయి. ఖానాపూర్‌లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆదిలాబాద్‌లో పాయల్ శంకర్(భాజపా), బోథ్‌లో అనిల్‌జాదవ్(భారాస), ఆసిఫాబాద్‌లో కోవలక్ష్మి(భారాస) ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఇదే అధికారులకు ఇబ్బందికరంగా మారింది.

ఆ అయిదుగురిలో..

గ్రామసర్పంచి/ప్రత్యేక అధికారి అధ్యక్షుడిగా వ్యవహరించే ఈ కమిటీలో స్వయం సహాయక సభ్యులైన ఇద్దరు మహిళలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ఆసక్తి కనబరిచే ముగ్గురిని ఎంపిక చేయాలి. ఈ ముగ్గురిలో ఒకరు బీసీ, మరొకరు ఎస్సీ/ఎస్టీ సామాజికవర్గానికి చెందిన వారు ఉండాలి. మిగతా ఒకరిని ఎవరినైనా చేర్చుకోవచ్చు. పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. మున్సిపాల్టీలో కౌన్సిలర్/ప్రత్యేక అధికారి ఛైర్మన్‌గా, వార్డు ప్రత్యేక అధికారి కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు. గ్రామాలవారీగా సేకరించి మండలాల నుంచి కలెక్టర్‌కు జాబితా పంపించే ఎంపీడీఓలపై, పట్టణంలో జాబితా పంపించే పురపాలక కమిషనర్‌పై ఒత్తిళ్లు మొదలయ్యాయి. అయిదుగురు సభ్యుల్లో తమవారు ఉండాలని నేతలు పట్టుబడుతున్నారు.

నేతల సిఫారసు

అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్య నేతలు గ్రామాలవారీగా తమ కార్యకర్తల జాబితాను తెప్పించుకున్నారు. నేరుగా ఎంపీడీఓలకు అవే జాబితాను పంపించారు. విషయం తెలిసిన ఓ విపక్ష ఎమ్మెల్యే అధికారులను ప్రశ్నిస్తే పైనుంచి పేర్ల జాబితా వచ్చిందని సమాధానమిచ్చినట్లు తెలిసింది. మరికొన్నిచోట్ల కీలకమైన కాంగ్రెస్ కార్యకర్తలు పంచాయతీ కార్యదర్శులకు జాబితా అందజేస్తే వారు ఎంపీడీఓలకు పంపించినట్లు సమాచారం. ఓ విపక్ష ఎమ్మెల్యే సైతం అయిదుగురిలో మూడు పేర్లచొప్పున తమకు నచ్చిన పేర్లతో జాబితాను ఎంపీడీఓలు పంపించారు. అన్ని జాబితాలు కూడా అధికారులు కలెక్టర్ ఆమోదంకోసం పంపించారు. ఆదిలాబాద్ మున్సిపాల్టీలో వార్డులవారీగా కాంగ్రెస్ జాబితా ఒకటి కమిషనర్‌కు నేరుగా రాగా, భాజపా, భారాస, ఇతర పార్టీలకు చెందిన కౌన్సిలర్లు ప్రత్యేకంగా జాబితాలను అందించారు. కొన్ని మండలాల్లో కాంగ్రెస్ వర్గాల మధ్యే పోటీ ఏర్పడింది.

మేముండి ఏం లాభం?

అనిల్‌జాదవ్, బోథ్ ఎమ్మెల్యే(భారాస)

ఎమ్మెల్యేగా మేముండి ఏం ప్రయోజనం. అలాగైతే ఎమ్మెల్యేలను కూడా నామినేటెడ్ పోస్టులాగా నియమించుకోండి. అధికారులను అడిగితే పైనుంచి జాబితా వచ్చిందంటున్నారు. గ్రామాలనుంచి రాకుండా పైనుంచి ఎలా వస్తుంది. జిల్లా కలెక్టర్‌ను కలిసి సమస్యను విన్నవిస్తాం.

పారదర్శకత లేదు..

పాయల్ శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే(భాజపా)

కమిటీల్లో ఎక్కడా పారదర్శకత లేదు. గతంలోనూ కోర్టు ఈ కమిటీలను తప్పుబట్టింది. మళ్లీ అదే జరగనుంది. న్యాయంగా ఎవరికి చోటు లభించాలో వారికి కల్పించాలి. ఎక్కడా అది జరగలేదు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం.

అంబేడ్కర్ విదేశీ విద్యానిధికి దరఖాస్తులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే జిల్లాకు చెందిన ఎస్సీ విద్యార్థులు 2024-25 సంవత్సరానికి అంబేడ్కర్ విదేశీ విద్యానిధి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఎస్సీ సంక్షేమఅధికారి సునీత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ-పాస్ ఆన్‌లైన్‌లో ఈ నెల 29 వరకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వివరాలకు **88869 76630** నెంబరును సంప్రదించాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)

ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్

? ఆదిలాబాద్ పట్టణంలోని దుర్గానగర్‌లో రూ.8 లక్షలతో ప్రజా మరుగుదొడ్డి నిర్మించారు. నిర్వహణ లోపంతో తలుపులు, పైపులు పోయి నిరుపయోగంగా మారింది. - సురేష్, స్థానికుడు

✔ ప్రజా మరుగుదొడ్డిని పరిశీలించి అవసరమైన మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటాం.
- ఎండీ ఖమర్ అహ్మద్, పుర కమిషనర్

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ గ్రామీణం

? జందాపూర్ శివారులో శ్మశాన వాటిక నుంచి రహదారి ఇరువైపులా ఉన్న కల్వర్టు డ్రైనేజీ నిండి వరద నీరు రహదారిపైకి వచ్చి ఇబ్బందులు పడుతున్నాం. పంట పొలాలకు వెళ్లాలంటే రైతులు, మహిళలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. - సి.గజానన్, జందాపూర్

✔ పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి డ్రైనేజీలో చెత్తను తొలగించి సమస్యను పరిష్కరిస్తా. - సత్యానంద్, ఎంపీవో, ఆదిలాబాద్

న్యూస్‌టుడే, ఇచ్చోడ:

? ఇచ్చోడలోని శివాజీచౌక్‌లో డ్రైనేజీలో మురుగు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. - స్థానికుడు, ఇచ్చోడ

✔ సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం.
- సూర్యప్రకాష్, పంచాయతీ ఈజీ

నాన్నే స్ఫూర్తి..
★ తండ్రితోపాటు ముగ్గురు బిడ్డలు టీచర్లే

కూతుళ్ల విజయానికి దీప్తి


తండ్రి మడావి లక్ష్మణ్‌తో కుమార్తెలు కవిత, దివ్య, కల్యాణి

న్యూస్‌టుడే, ఉట్నూరు : నాన్నంటే దిశ చూపే హితైషి.. నాన్నంటే వెలుగులు పంచుతూ.. కొవ్వొత్తిలా కరిగిపోయేవాడు. బిడ్డల మేలు కోరే మార్గదర్శి. అటువంటి ఓ నాన్న మార్గదర్శకత్వాన్ని అందిపుచ్చుకొన్న కుమార్తెలు తండ్రిని స్ఫూర్తిగా తీసుకొని ఆయనలాగే తాము ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం చేయాలని సంకల్పించారు. తండ్రి సలహాలు, సూచనలు తీసుకొని రాత్రింబవళ్లు కష్టపడి డీఎస్సీ పరీక్షలో ప్రతిభను చాటి సర్కారు టీచరు ఉద్యోగాలు సాధించి తమ కలలను నిజం చేసుకున్నారు. ఇలా ఒకే కుటుంబం నుంచి నలుగురు టీచరు ఉద్యోగాలు చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్న ఆ ఆదివాసీ పర్ధాన్ కుటుంబ విజయగాథపై కథనం.

ఏజెన్సీ కేంద్రమైన ఉట్నూరుకు చెందిన మడావి లక్ష్మణ్ పేద ఆదివాసీ కుటుంబంలో జన్మించారు. ప్రతికూల పరిస్థితుల మధ్య సర్కారు బడిలో పదో తరగతి.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్, తరువాత టీటీసీ చేశాడు. కుటుంబ పోషణ కష్టతరమైన ఆ రోజుల్లో ఏదైనా సర్కారు ఉద్యోగం చేసి కుటుంబానికి ఆసరాగా నిలవాలనే గట్టి సంకల్పంతో 1987లో ఐటీడీఏ చేపట్టిన ఉపాధ్యాయ డీఎస్సీకి ఎంపికై తొలిసారి ఎస్జీటీ ఉపాధ్యాయ ఉద్యోగం చేపట్టారు. ప్రస్తుతం ఇంద్రవెల్లి మండలం జాలంతండా గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

కలిసికట్టుగా కదిలారు..

మడావి లక్ష్మణ్, కమలబాయి దంపతుల ముగ్గురు కుమార్తెలు కవిత, దివ్య, కల్యాణిలు ప్రాథమిక విద్య సరస్వతీ శిశు మందిర్‌లో చదివారు. పదో తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో ఆ తరువాత ఇంటర్, డిగ్రీ ప్రైవేటు కళాశాలలో చేశారు. తండ్రి ఉపాధ్యాయ వృత్తిని చూసి చూసి ఆకర్షితులైన ఆయన కూతుళ్లు తాము సైతం అదే వృత్తిని చేపట్టాలని నిర్ణయించుకొన్నారు. టీటీసీ, బీఎడ్ చేసి ఉద్యోగాల కోసం సన్నద్ధయ్యారు. 2017లో ప్రభుత్వం ప్రకటించిన డీఎస్సీలో కవిత, దివ్య తమ తొలి ప్రయత్నంలోనే ప్రతిభ చాటారు. ప్రస్తుతం కవిత జెండాగూడలో ఎస్జీటీగా పని చేస్తున్నారు. దివ్య జైనూరు మండలంలో ఎస్జీటీగా విధులు నిర్వహిస్తున్నారు. మూడో కూతురు కల్యాణి తాజాగా విడుదలైన డీఎస్సీ ఫలితాలలో జనరల్ కేటగిరిలో 63వ ర్యాంకు సాధించి తన కలను నెరవేర్చుకున్నారు. ప్రస్తుతం కల్యాణికి సిరికొండ మండలంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో పోస్టింగ్ ఇచ్చారు.



బతుకమ్మ సంబరం

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పట్టణంలోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో బుధవారం బతుకమ్మ సందడి నెలకొంది. పాఠశాలలో విద్యార్థినులు, తల్లిదండ్రులు, టీచర్లు బతుకమ్మ చుట్టూ ఆడిపాడి ఉల్లాసంగా గడిపారు. దసరా సెలవులు ముగియడంతో విద్యార్థినులకు బతుకమ్మ గొప్పదనం తెలిసేలా.. ఉత్సాహం నింపేలా సంబరాలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ కమలాకర్, వైస్‌ప్రిన్సిపల్ స్వరూప, కో-ఆర్డినేటర్లు రమేష్, ప్రత్యూషరెడ్డి, అరుణ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సీఎంపై కేసు నమోదు చేయాలి : రామన్న

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : మూసీనది ప్రక్షాళనలో భారీ కుంభకోణం చోటుచేసుకుందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆరోపణలపై ఉట్నూరులో ఆయనపై పోలీసు కేసు నమోదు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగురామన్న తెలిపారు. ఇది దేనికి నిదర్శనమని ప్రశ్నించారు. వాస్తవానికి మోసపూరిత హామీలు ఇచ్చి ప్రజలను మోసగించిన సీఎం రేవంత్‌రెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని భారాస కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పట్టణ అధ్యక్షుడు అజయ్, నాయకులు నారాయణ, నర్సింగ్‌రావు, గోవర్ధన్, కుమ్రరాజు, పరమేశ్వర్, రమేష్, అశోక్, పురుషోత్తం, శ్రీనివాస్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న

పాము కాటుతో ఆశా కార్యకర్త మృతి


దృపతబాయి

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : ఇంద్రవెల్లి మండలం కొబ్బాయిగూడకు చెందిన కంద దృపతబాయి(30) పాము కాటుకు గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు, బంధువుల వివరాల ప్రకారం... మంగళవారం గ్రామంలో ఇంటికి తిరిగి జ్వరం బారిన పడిన వారి వివరాలు సేకరించారు. రాత్రి భోజనం చేసిన తర్వాత చిన్న కూతురు అఖిలతో కలిసి నిద్రించారు. అర్ధరాత్రి పాము కట్టడంతో ఆమె స్వయంగా 108కు సమాచారం ఇవ్వగా రిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు భర్త సోనేరావు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమార్తెలు, కొడుకు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత బలవన్మరణం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : వివాహిత పురుగు మందు తాగి బలవన్మరణానికి పాల్పడింది. ఆదిలాబాద్ టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు వివరాల ప్రకారం... మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా కిన్వట్ తాలూకా కోప్రా గ్రామానికి చెందిన ముండే జ్యోత్స్న(36) కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం ఉదయం చేనులోకి వెళ్లిన ఆమె కడుపు నొప్పి రావటంతో పురుగుల మందు తాగేసింది. కుటుంబ సభ్యులు రిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం ఉదయం మృతి చెందింది. జీరో ఎఫ్ఐఆర్ కింద కేసు నమోదు చేశారు.

వృద్ధురాలి ఆత్మహత్య

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ మండలం ముక్తాపూర్ గ్రామంలో కడుపునొప్పి భరించలేక ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్నట్లు ఏఎస్ఐ ఆత్మారాం నాయక్ బుధవారం తెలిపారు. యావత్మాల్ జిల్లా ఝరి తాలూకా దనోర్ గ్రామానికి చెందిన జర్పటివార్ మీరాబాయికి(60) సంతానం లేకపోవడంతో ముక్తాపూర్‌కు చెందిన మేనల్లుడు రామెల్లు గణేష్‌ను దత్తత తీసుకుంది. ప్రస్తుతం ఆమె ముక్తాపూర్‌లో నివాసముంటోంది. మూడేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. మంగళవారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయలుదేరిన మీరాబాయి ఎంతకూ తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆమె బంధువులు గ్రామంలో వెతకగా రాత్రి 10 గంటలకు గ్రామ శివారులోని ఓ చేనులో పడి ఉంది. కేసు నమోదు చేసుకున్నట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు.

నిలిపిన వాహనాన్ని ఢీకొని ఒకరికి గాయాలు

జైనథ్, న్యూస్‌టుడే : జైనథ్ మండలం పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద 44వ జాతీయ రహదారిపై నిలిపిన వాహనాన్ని ఢీకొని ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం ఉదయం 9 గంటలకు జరిగింది. స్థానికుల వివరాల ప్రకారం.. జైనథ్ మండలం కామాయికి చెందిన పోయం గజానన్ తన ద్విచక్రవాహనంపై ఆదిలాబాద్ వైపు వెళుతున్నాడు. పిప్పర్‌వాడ టోల్‌ప్లాజా వద్ద నిబంధనలకు విరుద్ధంగా నిలిపి ఉన్న వాహనాన్ని ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు రిమ్స్‌కు తరలించారు.

గంజాయి విక్రేతల అరెస్టు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : మహారాష్ట్ర యావత్మాల్ నుంచి గంజాయి తీసుకొచ్చి ఆదిలాబాద్‌లో విక్రయించటానికి యత్నిస్తున్న మహాలక్ష్మీవాడకు చెందిన రిజ్వాన్‌ఖాన్, సాయి తేజను బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. గంజాయి, ద్విచక్రవాహనాన్ని ఎస్ఐ విష్ణుప్రసాద్ స్వాధీనం చేసుకున్నారన్నారు.

ఆటో దహనం చేసిన నిందితుల రిమాండ్

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : మహాలక్ష్మీవాడలో మంగళవారం తెల్లవారుజామున ఆటోను దహనం చేసిన నిందితులు ముగ్గురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టూటౌన్ సీఐ కరుణాకర్‌రావు తెలిపారు. ఆ కాలనీకి చెందిన జాదవ్ పండిత్‌తో గొడవ పెట్టుకొని కక్షతో భుక్తాపూర్‌కు చెందిన దగడ్ సాయి, శ్రీరాంకాలనీకి చెందిన దన్‌గట్ సుధీర్, ఇందిరమ్మకాలనీకి చెందిన మీసాల అజయ్‌లు ఆటోకు నిప్పు పెట్టినట్లు ఐడీ పార్టీ పోలీసులు నరేందర్, రమేష్, సుధాకర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, గోపాల్, సంజయ్‌లు గుర్తించి వారిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించారన్నారు. ఎస్ఐ విష్ణుప్రకాష్ నిందితులను రిమాండ్‌కు తరలించారన్నారు.

విద్యార్థులు తెచ్చిన ఆనందం

పాలనాప్రాంగణం.న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం బ్రాహ్మణవాడ ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు వెళ్లిన నూతన ఉపాధ్యాయుడు కొప్పుల అనిల్ సరికొత్త అనుభూతిని సొంతం చేసుకున్నారు. నియామకపత్రంతో ఎంఈవో, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్ఎంలను కలిసిన ఆయన మధ్యాహ్నం వేళ కేటాయించిన పాఠశాలకు వెళ్లారు. హెచ్ఎం స్వామిని కలిసి పరిచయం చేసుకున్న ఆయన తరగతి గదిలోకి అడుగు పెట్టగానే విద్యార్థులు ఘనస్వాగతం పలికారు. అప్పటికప్పుడే కాగితపు పూల బోకేను ఇచ్చి సంబరపడ్డారు. ఆ సన్నివేశాన్ని స్వీయచిత్రంగా తీసుకున్నారిలా.



మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ

తాంసి, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ పథకం ఆధ్వర్యంలో బుధవారం తాంసి మండల పరిషత్ కార్యాలయంలో గ్రామ మంచినీటి సరఫరా సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఎంపీడీవో మోహన్‌రెడ్డి, తహసీల్దార్ లక్ష్మి, ఏఈ ప్రశాంత్ తదితరులు న్నారు.

హీరాసుక ఆలయ నిర్మాణానికి భూమిపూజ

నార్నూర్ (గాదిగూడ), న్యూస్‌టుడే : ఆదిమ గిరిజన ప్రధాన్ గురువు శ్రీసంత్ హీరాసుక మహారాజ్ ఆలయ నిర్మాణానికి బుధవారం గాదిగూడలో మాజీ ఎంపీపీ ఆడ రాజు భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే కోవ లక్ష్మి చొరవతో నిర్మాణం ప్రారంభించామన్నారు. సంఘం మండల అధ్యక్షుడు పాండురంగ్, ప్రధాన కార్యదర్శి వామన్, కోశాధికారి పర్సురామ్ గేడం, తదిరులున్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం తప్పనిసరి

నార్నూర్, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు నిత్యం పౌష్టికాహారం తీసుకోవడంతోనే తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉంటారని నార్నూర్ పీహెచ్ వైద్యాధికారి రాంబాబు అన్నారు. గుంజాల ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రంలో గర్భిణులకు ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.

సమత కమిటీ ఆధ్వర్యంలో లబ్ధిదారుల ఎంపిక

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఏజెన్సీలో సుప్రీంకోర్టు సూచించిన విధంగా సమత కమిటీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ జరపాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావు అన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

నార్నూర్, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల్లో చదివే విద్యార్థులకు మెరుగైన విద్యనందించి, ఉత్తమ ఫలితాలు సాధించే విధంగా కృషి చేయాలని జిల్లా మాధ్యమిక విద్యాధికారి రవీందర్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. విద్యార్థుల, అధ్యాపకుల హాజరు పట్టికలను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల విద్యా ప్రమాణాలపై ఆరా తీశారు. ప్రిన్సిపల్ కేవీ కేశవులు, అధ్యాపకులు ఉదయ్‌కుమార్, బాలాజీ కాంబ్లే, వెంకటరమణ, సుజాత, పుష్ప, జ్వాలేందర్, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


అధ్యాపకులతో సమావేశమైన డీఐఈవో రవీందర్ కుమార్

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : పోలీసు అమర వీరుల వారోత్సవాలను పురస్కరించుకొని విద్యార్థులకు పలు అంశాలపై వ్యాస రచన పోటీలను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. 20 నుంచి 26 వరకు వ్యాసరచన పోటీలుంటాయన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన జిల్లా స్థాయిలో ముగ్గురిని ఎంపిక చేసి బహుమతులందజేస్తారన్నారు. వారిని రాష్ట్రస్థాయికి పంపిస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు తెలుగు, ఆంగ్లం, ఉర్దూ భాషల్లో వారికి కేటాయించిన అంశాలపై వారు https:///forms.gle/iNv6Y5mSJjW8W1Uj7 లో అప్‌లోడ్ చేయాలన్నారు. 12వ తరగతి వరకు విద్యార్థులు 'విచక్షణతో కూడిన చరవాణి వినియోగం' అంశంపై, డిగ్రీ ఆపై చదువుతున్న వారు 'తెలంగాణను మాదక ద్రవ్యాల రహిత రాష్ట్రం తీర్చిదిద్దటంలో నా పాత్ర' అనే అంశంపై వ్యాసాలను రాయాల్సి ఉంటుందన్నారు. వ్యాసాలు అయిదు వందల పదాలకు మించకుండా ఉండాలని సూచించారు.

కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థుల రాత పరీక్షలు ప్రారంభం

ఆదిలాబాద్ నేర విభాగం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ పోలీసు శిక్షణ కేంద్రంలో 9 నెలల పాటు శిక్షణ పొందిన 254 మంది అభ్యర్థులకు తుది రాత పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభయ్యాయి. మరో మూడు రోజులు వివిధ అంశాలపై పరీక్షలు నిర్వహించనున్నారు. తొలి రోజు భారతీయ న్యాయ సంహిత, భారతీయ సాక్ష్య అధినీయం, బీఎస్ఏలలో పరీక్షలు నిర్వహించారు. కేంద్రాన్ని ఎస్పీ గౌష్ ఆలం పరిశీలించారు. నిజామాబాద్ నుంచి వచ్చిన సీటీసీ ఏసీపీ సయ్యద్ మస్తాన్‌అలీ పరీక్షల నిర్వాహకుడిగా వ్యవహరించారు. ఎస్పీతో పాటు శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ సి.సమయ్‌జాన్‌రావు, ఆర్ఐ కార్తిక్, ఆర్ఎస్ఐ రాకేష్ తదితరులున్నారు.


రెండో సెమిస్టర్ పరీక్షలు రాస్తున్న శిక్షణ కానిస్టేబుళ్ల కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ గౌష్ ఆలం

నమ్మకాన్ని పెంచాలి

ఆదిలాబాద్ నేర విభాగం: పోలీసు స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేసిన ప్రతి ఒక్కరి సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించి పోలీసులపై నమ్మకాన్ని పెంచేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ గౌష్ ఆలం సూచించారు. పట్టణంలోని డీఎస్పీ కార్యాలయాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు సీఐలు కరుణాకర్‌రావు, సునీల్‌కుమార్ ఎస్పీకి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. దస్త్రాలను పరిశీలించారు. ప్రజలు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించాలని డీఎస్పీకి సూచించారు. సీఐలు శ్రీనివాస్, నవీన్, డీఎస్పీ కార్యాలయ సిబ్బంది జైపాల్, రవి, కిష్టయ్య, గణేష్ ఉన్నారు.

'దేవాలయాలపై దాడులు చేస్తే సహించం'


ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : హిందూ దేవాలయాలపై కొన్ని రోజుల నుంచి వరుసగా దాడులు జరుగుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం విడ్డూరంగా ఉందని, ఇక నుంచి దాడులు చేస్తే సహించబోమని భాజపా రాష్ట్ర నాయకుడు గుగ్లావత్ శ్రీరాం నాయక్, బానోత్ జగన్ అన్నారు. బుధవారం ఉట్నూరులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కార్యదర్శి కొండేరి రమేష్‌తో కలిసి మాట్లాడారు. లింగాగౌడ్, రాజశేఖర్, రమేష్, వెంకటేష్, రాజేశ్వర్, రవి, సతీష్ పాల్గొన్నారు.

18న పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పోటీలు

ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవం పురస్కరించుకొని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18న మూడు అంశాలపై చిత్ర ప్రదర్శన పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటకశాఖ అధికారి రవీందర్ తెలిపారు. ఆదిలాబాద్‌లోని పర్యాటక ప్రదేశాలు, వైల్డ్‌లైఫ్, సంస్కృతి అనే అంశాలపై పోటీలు ఉంటాయని ఆయన తెలిపారు ఆసక్తి గల వాళ్లు ప్రదర్శించే రెండు ఫొటోలు, వాటి వెనుక భాగంలో పేరు, ఫోన్ నెంబరు రాసి ఈ నెల 17 సాయంత్రం మూడు గంటల్లోగా స్థానిక పెన్‌గంగ అతిథి గృహం, సాత్నాల క్వార్టర్స్, ఆదిలాబాద్‌లో అందించాలని ఆయన తెలిపారు. చిత్ర పదర్శన 18న టీటీడీసీలో ఉదయం 10 గంటలకు ఉంటుందని ఆయన తెలిపారు.

ప్రభుత్వ న్యాయవాదులకు సన్మానం

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఇటీవల ప్రభుత్వ న్యాయవాదు(జీపీ/పీపీ)లుగా నియమితులైన పోరెడ్డి దయాకర్, సంజయ్ వైరాగరె, మేకల మధుకర్‌లను బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం అభినందనలు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేష్, కార్యదర్శి సంతోష్, సంగెం చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ సుధీర్‌కుమార్, న్యాయవాదులు మోహన్‌సింగ్, రమణారెడ్డి, అఫ్రోజ్, అనిల్, శ్రీనివాస్‌రెడ్డి, చందూసింగ్, గంగారాం, తదితరులు ఉన్నారు.


సంజయ్ వైరాగరెను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

గిరిజన అమరులకు నివాళులు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : తెలంగాణ ఉద్యమకారులు ఇంద్రవెల్లి గిరిజన అమరులకు నివాళులర్పించారు. తెలంగాణ ఉద్యమకారులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్తూపం నుంచి బయల్దేరిన పాదయాత్ర బుధవారం ఇంద్రవెల్లికి చేరింది. గిరిజన అమరులకు నివాళులర్పించిన అనంతరం ఉద్యమకారుల రాష్ట్ర అధ్యక్షుడు దాసరి శ్రీశైలం మాట్లాడారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.10 కోట్లు మంజూరు
★ భారాస, కాంగ్రెస్ నాయకుల మాటల యుద్ధం

బోథ్, న్యూస్‌టుడే : బోథ్ నియోజకవర్గంలోని పలు అభివృద్ధి పనులకు బుధవారం ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసింది. కాంగ్రెస్, భారాస పార్టీల మధ్య పంచాయితీ నెలకొంది. బోథ్ మండలం ధన్నూర్-బి సమీపంలోని వంతెన నిర్మాణానికి రూ.3.30 కోట్లు, ఇచ్చోడ మండలం బోరిగాంలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.20 కోట్లు, గుడిహత్నూర్ ఎన్‌హెచ్-44 నుంచి కొల్హారి గ్రామంలోని గిడ్డంగి వరకు రోడ్డు నిర్మాణానికి రూ.3.50 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసింది. నియోజకవర్గ అభివృద్ధికి ప్రభుత్వం రూ.10 కోట్ల నిధులు మంజూరు చేసిందని, ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు అంటూ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గజేందర్ జీవోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. భారాస ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వర్గీయులు ఎమ్మెల్యే ద్వారానే నిధులు మంజూరయ్యాయంటూ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి కృతజ్ఞతలు అంటూ పెట్టారు. ఇరు పార్టీల నాయకుల సందేశాలు వైరల్‌గా మారాయి. ఇరు పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం నెలకొంది.

మండలానికి కొత్త ఉపాధ్యాయులు

ఉట్నూరు గ్రామీణం: కొత్త ఉపాధ్యాయులు బుధవారం ఆయా పాఠశాలల్లో విధుల్లోకి చేరారు. మండలంలో అయిదుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరారు. చాందూరిలో ఇద్దరు, పెద్దగంగాపూర్, పులిమడుగు, తాండ్ర పాఠశాలల్లో ఒక్కొక్కరు చేరారు. బదిలీపై నేరడిగొండ మండలం నుంచి ఇద్దరు, నార్నూర్, ఇంద్రవెల్లి నుంచి ఒక్కొక్కరు వచ్చారు. శ్యాంపూర్, పెద్దగంగాపూర్, సాలెవాడ(కె), సాలెవాడ(బి)లో ఒక్కొక్కరు విధుల్లో చేరినట్టు మండల విద్యాధికారి రాపెల్లి ఆశన్న తెలిపారు.

బేల: డీఎస్సీ 2024లో ఉపాధ్యాయులుగా నియమితులైన అభ్యర్థులు బుధవారం విధుల్లో చేరారు. బేల మండలంలో 28 మంది కొత్త ఉపాధ్యాయులను కేటాయించగా వారంతా వనరుల కేంద్రానికి తరలిరావడంతో అక్కడ సందడి నెలకొంది. ఎంఈఓ నర్సింహులుకు నియామకపత్రాలను అందజేశారు..

నాణ్యమైన విద్యనందించండి

ఉట్నూరు: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి రవీందర్ ఆదేశించారు. బుధవారం ఆయన ఉట్నూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. విద్యార్థుల హాజరు, సిలబస్ ఇతర అంశాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ప్రిన్సిపల్ ధన్‌రాజ్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంఘటిత కార్మికుల ర్యాలీ

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : షాపింగ్‌మాళ్లు, సూపర్‌మార్కెట్, జిన్నింగ్, దుకాణాలు, ఇతర సంస్థల్లో పని చేస్తున్న సంఘటిత కార్మికులు పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ కలెక్టరేట్ వరకు కొనసాగింది. విశ్రాంత కార్మికశాఖ అధికారి జగదీష్‌రెడ్డి మాట్లాడుతూ పొరుగు రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం పదేళ్లుగా వారిని పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. అదనపు పాలనాధికారి శ్యామలదేవిని కలిసి ఆయా సమస్యలను విన్నవించారు. ఛాంబర్ ఆఫ్ కామర్స్ జిల్లా కార్యదర్శి గండ్రత్ సంతోష్, కార్మికులు పాల్గొన్నారు.


ర్యాలీలో కార్మికులు

సంక్షిప్త సమాచారం

రాష్ట్ర సదస్సుకు ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆదిలాబాద్ అర్బన్: నిజామాబాద్‌లో నిర్వహించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సదస్సుకు జిల్లా ఎమ్మార్పీఎస్ బుధవారం నాయకులు తరలివెళ్లారు. ఎస్సీ వర్గీకరణకు ఒత్తిడి తెచ్చేందుకు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సుకు వీహెచ్‌పీ, ఎంఎంఎస్, ఎంఎస్ఎఫ్, అనుబంధ సంఘాల నాయకులు తరలివెళ్లారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఆరెల్లి మల్లేష్ మాదిగ తదితరులున్నారు.

గ్రంథాలయ ఛైర్మన్ పదవి ఇవ్వండి

ఆదిలాబాద్ అర్బన్: పార్టీ కోసం కష్టపడి పని చేస్తున్న తనను నామినేటెడ్ పోస్టుకు పరిశీలించాలని కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ కోరారు. హైదరాబాద్‌లో పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్, రాష్ట్ర ఇన్‌ఛార్జి దీపాదాస్ మున్షీని కలిశారు. గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ పదవిని కోరుతూ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి సిఫారసు పత్రాన్ని అందజేశారు.

నేడు మహర్షి వాల్మీకి జయంతి

ఆదిలాబాద్ అర్బన్: మహర్షి వాల్మీకి జయంతి కార్యక్రమాన్ని గురువారం అధికారికంగా నిర్వహించనున్నట్లు బీసీ సంక్షేమశాఖ అధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు కలెక్టర్ సమావేశమందిరంలో నిర్వహించే జయంతికి ప్రజాప్రతినిధులు, అధికారులు, వాల్మీకి, బోయ, బీసీ సంఘాల నాయకులు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

18న బోథ్ బంద్‌కు పిలుపు

బోథ్: ఈ నెల 18న బోథ్ బంద్‌కు పిలుపునిస్తున్నట్లు ముస్లిం జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు బుధవారం పిలుపునిచ్చారు. మహమ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలకు వ్యతిరేకంగా బంద్‌కు పిలుపునిస్తున్నట్లు పేర్కొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి

సొనాల(బోథ్): గ్రామాభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ అన్నారు. సొనాల జిల్లా పరిషత్ పాఠశాలలో, బుద్ధవిహార్‌లో ఎంపీపీ నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం ఆయన ప్రారంభించారు. గ్రామస్థులు అభిలాష్, హరీశ్, చంద్రకాంత్, శ్రీనివాస్, సదానందం, భూమన్న, అభిలాష్, సుగుణాకర్, వెంకట్, గౌతంరెడ్డి, అర్జున్, రాజు పాల్గొన్నారు.


విద్యార్థులు ప్రదర్శిస్తున్న వివిధ రకాల ఆహార పదార్థాలు, పరిశీలిస్తున్న అధ్యాపకులు

ఘనంగా ఆహార దినోత్సవం

ఉట్నూరు: ప్రపంచ ఆహార దినోత్సవాన్ని బుధవారం ఉట్నూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైఫ్ సైన్సెస్, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు వివిధ రకాల పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. వైస్ ప్రిన్సిపల్ సాయిప్రసాద్, కోఆర్డినేటర్ నర్సింగ్‌రావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటుపుస్తకాల వితరణ

బజార్‌హత్నూర్: బజార్‌హత్నూర్‌కు చెందిన భారాస నాయకుడు దుబ్బుల చంద్రశేఖర్ తన కుమారుడు రుద్రాన్ష్ పుట్టినరోజు సందర్భంగా యూపీఎస్ పాఠశాల విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

పాలనాప్రాంగణం: జిల్లాస్థాయి జాతీయ సైన్సు సెమినార్, సదరన్ ఇండియా సైన్సు డ్రామా పోటీల్లో జిల్లాకు చెందిన పది మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఆదిలాబాద్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల నెం.2లో బుధవారం జిల్లాస్థాయి పోటీలను నిర్వహించారు. సైన్సు సెమినార్‌లో సెయింట్ జోసెఫ్ కాన్వెంట్ హైస్కూల్‌కి చెందిన విద్యార్థిని ఎల్.వృందసాన్వి, సైన్సు డ్రామా విభాగంలో జైనథ్ మండలం లక్ష్మీపూర్ జడ్పీఎస్ఎస్ విద్యార్థి బి.కృష్ణవేణి బృంద సభ్యులు తొమ్మిది మంది రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికకాగా.. వారిని డీఈవో ప్రణీత, సైన్సు అధికారి రఘురమణ, అదనపు సైన్సు అధికారి ఆరెభాస్కర్ అభినందించారు. పోటీల కన్వీనర్‌గా మెరుగు సుధాకర్, ప్రధానోపాధ్యాయులు పోరెడ్డి అశోక్, మద్ది లస్మన్న, జ్యూరీ కమిటీ సభ్యులు విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు.

హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వం

తలమడుగు: గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించిందని భాజపా జిల్లా అధ్యక్షుడు పతంగె బ్రహ్మానంద్ అన్నారు. బుధవారం తలమడుగులో భాజపా సభ్యత్వ నమోదు కార్యక్రమంలో స్థానిక నాయకులతో కలిసి ఆయన పాల్గొన్నారు.

ఒకరి అదృశ్యం : కేసు నమోదు

తలమడుగు: తలమడుగుకు చెందిన ఠాకూర్ కిష్టన్న(47) వేరే గ్రామానికి వెళుతున్నానని చెప్పి 20 రోజుల కిందట ఇంటి నుంచి బయల్దేరాడు. తిరిగి రాకపోవటంతో బంధువుల ఇళ్లల్లో, చుట్టుపక్కల గ్రామాలలో వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అంజమ్మ పేర్కొన్నారు.

కుమురం భీం వర్ధంతికి తరలిరావాలి

సొనాల(బోథ్): సొనాలలోని కుమురంభీం విగ్రహం వద్ద గురువారం నిర్వహించే వర్ధంతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్డి-బి రాయిసెంటర్ పెద్దలు పేర్కొన్నారు. పార్డి-బిలో ఆదివాసీ గ్రామాల పటేళ్లు, పెద్దలు సమావేశం నిర్వహించారు.

ఎమ్మెల్యే వివేక్‌పై వ్యాఖ్యలు చేయటం సరికాదు

బోథ్: ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామిపై ఎమ్మార్పీఎస్ నాయకులు చేసిన వ్యాఖ్యలు సరికావని, వాటిని ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడు ఎల్క రాజు అన్నారు. బోథ్‌లో బుధవారం సంఘం నాయకులతో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండల కార్యదర్శి మునేశ్వర్ సోమన్న, సంఘం సభ్యులు సురేందర్, ఊశన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం గొలుసు దుకాణాలకు అడ్డుకట్ట ఏది?

భుక్తాపూర్, న్యూస్‌టుడే : గ్రామాల్లో, గల్లీల్లో మద్యం గొలుసు దుకాణాలు విచ్చలవిడిగా వెలుస్తున్నాయని, వీటికి అడ్డుకట్ట ఏదని సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు రాములు, అరుణ్‌కుమార్, కాంబ్లే రాందాస్, షేక్ పాషా, నర్సింగ్‌రావు, బి.రామన్న, తాజ్ తదితరులు ఉన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ

నార్నూర్, న్యూస్‌టుడే: యాసంగి రైతులకు డీలర్లు నాణ్యమైన విత్తనాలతో పాటు నాణ్యమైన ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని జిల్లా వ్యవసాయ శాఖాధికారి శ్రీధర్ స్వామి పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని వైష్ణవి ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేశారు. డీలర్లతో మాట్లాడుతూ నాసిరకం విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు సంతోష్ చాటే, పృథ్వీరాజ్, మేస్రం మానిక్‌రావు, రాము జివాళే, తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భం ఓ మధుర జ్ఞాపకం..!!

● కొలువులో చేరిన కొత్త ఉపాధ్యాయులు

మామడ, న్యూస్‌టుడే: ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలంటే మాటలు కాదు. తీవ్రమైన పోటీలో తమ ప్రతిభతో వేలాది మంది కన్నా ముందు నిలిస్తేనే కోరుకున్న కొలువు సొంతమవుతుంది. అందులోనూ గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరే అవకాశం వస్తే అంతకన్నా ఆనందం ఇంకేముంటుంది. ఇటీవల విడుదలైన డీఎస్సీ ఫలితాల్లో గురువులుగా ఎంపికైన వారు బుధవారం విధుల్లో చేరారు. టీచర్లుగా తొలిరోజు వారికి జీవితంలో ఎప్పటికీ గుర్తుండి పోయే మధుర జ్ఞాపకం. నూతనంగా బాధ్యతల్లో చేరిన పలువురు తమ అనుభూతులను ఇలా పంచుకున్నారు..



మామడ పాఠశాలలో సురేష్ పవార్‌కు స్వాగతం పలుకుతున్న విద్యార్థులు, సహచర ఉపాధ్యాయులు

ఈ స్వాగతం చిరస్మరణీయం..

ఎవరికైనా బడితో అనుబంధం ఎంతో మధురంగా ఉంటుంది. అందుకే ఉన్నత స్థానాలకు చేరుకున్నా తాము చదువుకున్న పాఠశాలకు వీలైనప్పుడల్లా వెళ్తుంటారు. ఉపాధ్యాయులుగా ఎంపికైన వారికి నిత్యం మళ్లీ విద్యార్థి దశ గుర్తొస్తుందన్న అభిప్రాయాన్ని మామడ జడ్పీఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా విధుల్లో చేరిన కుంటాల మండలం అంబుగామ్‌కు చెందిన సురేష్ పవార్ వ్యక్తం చేశారు. మొదటి రోజు బడికి వచ్చిన నాకు తోటి ఉపాధ్యాయులు చెప్పిన స్వాగతం, ప్రభుత్వ కొలువు సాధించి హాజరు రిజిస్టర్లో చేసిన సంతకం అంతా ఓ కొత్త అనుభూతినిచ్చిందని సురేష్ సంబరపడ్డారు.



ఉన్న ఊరులోనే ఉపాధ్యాయురాలిగా..

దస్తురాబాద్ మండలం మున్యాల్‌కు చెందిన మౌనిక మామడ మండలం పొన్కల్‌కు చెందిన హరీష్‌ను వివాహం చేసుకున్నారు. డీఎస్సీలో ఎస్జీటీగా ఎంపికైన ఆమెకు మెట్టినిల్లైన పొన్కల్‌లోనే ఉపాధ్యాయురాలిగా పనిచేసే అవకాశం వచ్చింది. తొలి రోజు విధుల్లో చేరిన నాకు పిల్లలకు పాఠాలు చెప్పడం, సహచర ఉపాధ్యాయులను కలవడం కొత్త అనుభూతినిచ్చిందన్నారు. ఉపాధ్యాయురాలిగా విద్యార్థులకు చక్కగా చదువు చెప్పి మంచి పేరు తెచ్చుకుంటానని ఆనందం వ్యక్తం చేశారు.



పొన్కల్ పాఠశాలలో పిల్లలతో మౌనిక

అమ్మానాన్నల దగ్గరే ఉండి మళ్లీ బడికి..

జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం కేశాపూర్‌కు చెందిన లక్ష్మీ-గంగాధర్ దంపతుల కుమార్తె దివ్యరాణి. ఈమెకు నిర్మల్ మండలం నీలాయిపేటకు చెందిన మురళితో వివాహమైంది. అప్పటి నుంచి ఆ గ్రామంలోనే ఉంటున్నారు. ఉపాధ్యాయురాలిగా ఎంపికైన దివ్యరాణికి సొంత జిల్లా జగిత్యాలలో పోస్టింగ్ వచ్చింది. సహజంగా చిన్నప్పుడు అమ్మానాన్నల దగ్గరుండి పిల్లలు బడికెళ్తుంటారు. ఇప్పుడు మళ్లీ తల్లిదండ్రుల దగ్గరుండి పాఠశాలకు వెళ్లే అవకాశం రావడం అదృష్టమని అభిప్రాయపడ్డారు. సొంతూరు కేశాపూర్‌కు సమీపంలోనే ఎర్దండి ప్రాథమిక పాఠశాలలో ఆమె విధుల్లో చేరారు. గురువుగా అంకిత భావంతో పని చేస్తానని, పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తానన్నారు. ఒక ఉపాధ్యాయురాలిగా తొలిరోజు ఎప్పటికీ గుర్తుండిపోతుందన్నారు.



విధుల్లో చేరే ముందు తల్లిదండ్రుల ఆశీర్వాదం తీసుకుంటున్న దివ్యరాణి

మొన్నటి దాకా నిరుద్యోగులు..

జీవితంలో ఎత్తుపల్లాలు సహజం. ఉద్యోగం లేక చిన్నాచితక పనులు చేసుకుంటూ నిరుద్యోగులుగా ఎన్నో కష్టాలు పడ్డ వారు ఉద్యోగులుగా మారిన క్షణాన్ని ఎలా మరిచిపోగలరు. ఓ కొత్త జీవితానికి నాంది పలికిన సందర్భం ఎంతో ప్రత్యేకంగా నిలుస్తుంది. ప్రణాళిక, పట్టుదల, క్రమశిక్షణతో అడుగులు వేసే వారికి ఆలస్యంగానైనా మంచి ఫలితాలు వస్తాయని యువత తమ ప్రతిభతో నిరూపిస్తున్నారు.

నేనే మీ ఊరి కొత్త టీచర్ను..

నిర్మల్‌కు చెందిన అబిలాష్ ఇన్నాళ్లు మామడ మండలంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. తాజాగా ఉపాధ్యాయునిగా ఎంపికైన ఆయనకు పెంబి మండలం అంకెన గ్రామపంచాయతీ పరిధిలోని బూరుగుపల్లి ప్రాథమిక పాఠశాలను కేటాయించారు. మొదటి రోజు ఆ ఊరికి వెళ్లిన అబిలాష్ గ్రామస్థులను కలిశారు. పిల్లలను క్రమం తప్పకుండా బడికి పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు. పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన అనుభవంతో పాఠశాలను చక్కగా తీర్చిదిద్దుతానన్నారు. సమాజంలో గౌరవప్రదమైన ఉపాధ్యాయ వృత్తిలో చేరడం అదృష్టంగా భావిస్తున్నానని అభిప్రాయపడ్డారు. జీవితంలో ఇది గుర్తుండి పోయే రోజని ఆనందం వ్యక్తం చేశారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న అబిలాష్

ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతా..

మామడ మండలం గొండుగూడకు చెందిన మోహన్ తానూరు మండలం ఝరి తండా పాఠశాలలో బాధ్యతలు తీసుకున్నారు. సొంతూరులో మొదటి ప్రభుత్వ ఉద్యోగిగా ఆయన ప్రత్యేక గుర్తింపు పొందారు. మారుమూల తండా పాఠశాలలో పనిచేసే అవకాశం వచ్చిందని, బాధ్యతలు చక్కగా నిర్వర్తించి అక్కడి పిల్లలను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతానన్నారు. ఇన్నాళ్లు నిరుద్యోగిగా ఎంతో కష్టపడ్డాను..ఇప్పుడు ఉపాధ్యాయునిగా ఇష్టంగా పని చేసి మంచి పేరు తెచ్చుకుంటానని చెప్పారు. కొత్తగా విధుల్లో చేరిన సందర్భంలో ఆనందబాష్పాలు వచ్చాయని ఈ రోజు ఎంతో ప్రత్యేకంగా నిలిచి పోతుందన్నారు.



ఝరి పాఠశాలలో తొలిరోజు విద్యార్థులకు పాఠం చెబుతున్న మోహన్

హత్య కేసులో 16 మందికి జీవిత ఖైదు, జరిమానా

క్రైం కార్నర్

రెబ్బెన, న్యూస్‌టుడే: కుమురంభీం జిల్లా రెబ్బెన మండలం సింగిల్‌గూడ గ్రామానికి చెందిన ఆజ్మీర రమేష్ హత్యకు కారణమైన 16 మందికి జీవిత ఖైదు, రూ.1,49,000 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ సెషన్స్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేష్ బుధవారం తీర్పునిచ్చినట్లు ఎస్పీ డి.వి శ్రీనివాసరావు తెలిపారు. ఎస్పీ వివరాల ప్రకారం.. 2020 ఆగస్టు 19న రమేష్ సోదరి రాజేశ్వరి తన ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో అదే గ్రామానికి చెందిన జర్పుల సురేష్ ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో సోదరుడు రమేష్, ఆయన కుమారుడు లోకేష్ ఇంటి నుంచి బయటకు రావడంతో సదరు వ్యక్తి పారిపోయాడు. అనంతరం రమేష్ ఇతర పనులకు బయటకు వెళ్లి ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో.. విషయాన్ని మనసులో పెట్టుకున్న సురేష్ 15 మందితో కలిసి వెంట తెచ్చుకున్న గొడ్డలితో రమేష్‌ను తలపై నరికారు. మిగిలిన వారు రాజేశ్వరి, భార్య రేణుకలపై కర్రలతో దాడి చేశారు. తీవ్రంగా గాయపడ్డ రమేష్ మంచిర్యాల ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందారు. ఈ ఘటనపై అప్పటి రెబ్బెన ఎస్సై డి.రమేష్ మొదటి ఇన్వెస్టిగేషన్ అధికారిగా నియామకమయ్యారు. జర్పుల సురేష్, జర్పుల సత్యవతి, ఆజ్మీర వసంత్‌రావు, జర్పుల తిక్యానాయక్, జర్పుల హరీశ్, ఆజ్మీర అరవింద్, ఆజ్మీర నవీన్, ఆజ్మీర ప్రవీణ్, ఆజ్మీర సంతోష్, ప్రవీణ్‌కుమార్, జర్పుల లక్ష్మి, జర్పుల రజిత, జర్పుల తుకారం, జర్పుల రవి, జర్పుల రాజు, జర్పుల బిక్యానాయక్‌లపై మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. ఆసిఫాబాద్ లైజనింగ్ అధికారి (ఏఎస్సై) రామ్‌సింగ్ ఆధ్వర్యంలో కోర్టు కానిస్టేబుల్ ఉమేశ్వర్ కోర్టులో 16 మంది నిందితులను ప్రవేశ పెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ జగన్‌మోహన్‌రావు వాదించారు. న్యాయమూర్తి జి.వి రమేష్ శిక్ష విధించినట్లు ఎస్పీ వివరించారు.

ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష

ఎదులాపురం, న్యూస్‌టుడే : ఆరేళ్ల బాలికపై అత్యాచారం కేసులో ఆదిలాబాద్‌కు చెందిన జమీల్‌ఖాన్(25)కు 20 సంవత్సరాల జైలు శిక్ష, రూ.7 వేల జరిమానా విధిస్తూ ఆదిలాబాద్ పోక్సో కోర్టు బుధవారం తీర్పును వెలువరించింది. లైజన్ అధికారి జి.పండరి వివరాల మేరకు.. పట్టణంలోని ఒక కాలనీకి చెందిన బాలికకు, ఆమె తమ్ముడికి చదువు చెప్పే జమీల్‌ఖాన్ తన ఇంట్లో శుభకార్యం ఉందని చెప్పి 2021 ఫిబ్రవరి 14న సాయంత్రం 5.30కు బాలికను, ఆమె తమ్ముడి(4)ని ఇంటికి తీసుకెళ్లాడు. తిరిగి ద్విచక్ర వాహనంపై వారిని దిగబెట్టడానికి బయలుదేరి మధ్యలో వాహనాన్ని ఆపి బాధితురాలి తమ్ముడికి చరవాణి ఇచ్చి బాలికను పొదల్లోకి తీసుకెళ్లి అత్యాచారం చేశాడు. తరువాత వారిని ఇంటి వద్ద దింపగా బాలిక ఏడుస్తూ విషయాన్ని తల్లికి చెప్పింది. వారు వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి సీఐ రామకృష్ణ కేసును నమోదు చేశారు. ఈ కేసులో కోర్టు విధుల పోలీసు అధికారి ఠాకూర్ రవీందర్‌సింగ్ ప్రవేశపెట్టిన 14 మంది సాక్షులను ప్రత్యేక పీపీ విచారించి నేరాన్ని రుజువు చేశారు. పోక్సో కోర్టు న్యాయమూర్తి పి.శివరాంప్రసాద్ పైమేరకు తీర్పునిచ్చారు.

దివ్యాంగుడిపై లైంగిక దాడి

ఇచ్చోడ, న్యూస్‌టుడే : దివ్యాంగుడిపై యువకుడు లైంగిక దాడికి పాల్పడిన ఘటన ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలంలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఓ గ్రామానికి చెందిన యువకుడు(20) ఈ నెల 13న రాత్రి సమయంలో అదే గ్రామానికి చెందిన దివ్యాంగుడిని(32) పక్కనే ఉన్న పంట పొలానికి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితుడికి రక్తస్రావం కావడంతో గమనించి కుటుంబ సభ్యులు ఆరా తీశారు. విషయం తెలియడంతో మంగళవారం బాధిత కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాసరలో గంగాహారతి

ముథోల్(బాసర): దేవాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం బాసర గోదావరి నది వద్ద గంగాహారతి నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు ప్రత్యేకపూజలు చేసిన అనంతరం గోదావరి నదికి హారతి ఇచ్చారు. బాసర గ్రామస్థులతో పాటు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావడంతో గోదావరి నది వద్ద భక్తుల సందడి కనిపించింది. కార్యక్రమంలో ఆలయ ఇన్‌ఛార్జి ఈఓ విజయరామారావు, వేదపండితులు పాల్గొన్నారు.




గోదావరినదికి హారతి ఇస్తున్న అర్చకులు

ఆత్మగౌరవానికి ప్రతీక.. కుమురం భీం

● నేడు జోడేఘాట్‌లో వర్ధంతి

ఈనాడు, ఆసిఫాబాద్, న్యూస్‌టుడే, కెరమెరి

అడవుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్‌లో పుట్టి ఆదివాసీల ఆత్మగౌరవానికి ప్రతీక అయిన కుమురం భీం.. జీవితం, పోరాటం అడుగడుగునా వీరోచితం. వనాలతో మమేకమైన బతుకులతో ఆటలాడుతున్న నిజాం సైన్యానికి నూనుగు మీసాల వయసులోనే వెన్నులో వణుకు పుట్టించిన గోండు బెబ్బులి. గెరిల్లా పోరాటాల్లో తోటి వారికి తర్ఫీదునిచ్చి గ్రామాలను ఒక్కటిగా చేసి నిజాం గుండెల్లో రైళ్లు పరుగెత్తించిన వీరుడు. నమ్మక ద్రోహ చర్యలో అసువులు బాసిన ఆయనను మరోసారి స్మరించుకునేందుకు ప్రజలందరి అడుగులు గురువారం (17న) జోడేఘాట్ వైపే సాగనున్నాయి.



తుపాకీ శిక్షణ కోసం

అధికారి మరణంతో ఆదివాసీలపై అధికారుల నిర్బంధం ఎక్కువయ్యాయి. చదువు లేక పోవడంతో జరిగే అనర్థాలు తెలుసుకున్న భీం.. ఈ క్రమంలో జల్, జంగల్, జమీన్ లక్ష్య సాధనలో చదువుతో పాటు తుపాకీ పేల్చడం నేర్చుకోవాలని నిర్ణయించుకున్నారు. 1935లో కోవ అర్జు, మడావి కొద్దు, కుమ్ర లచ్చులతో కలిసి అసోం ప్రాంతానికి వెళ్లారు. తుపాకీ వాడకం నేర్చుకుని మూడేళ్ల తర్వాత తిరిగి సొంత ప్రాంతానికి వచ్చారు.

పోరాటం వైపు పయనం..

ప్రస్తుత కుమురంభీం జిల్లా ఆసిఫాబాద్ మండలం పాత రౌట సంకెపల్లిలో 1900 అక్టోబరు 22న మైనుబాయి-చిన్ను దంపతులకు కుమురం భీం జన్మించారు. చిరుప్రాయంలోనే తండ్రి చనిపోవడంతో కుటుంబం సుర్దాపూర్ ప్రాంతానికి వలస వెళ్లింది. అటవీ పుత్రులైన గిరిజనులపై ఆ సమయంలో నిజాం ప్రభువు రకరకాల పన్నులు వసూలు చేసేవారు. దీనిపై వారిలో అసహనం వ్యక్తమైనా ఎవరై ధైర్యం చేయలేని పరిస్థితులు. భీం సాగు చేసిన పంట చేతికొచ్చిన తరుణంలో పంటను కాజేయడానికి అటవీ అధికారి సిద్ధిక్ రాగా.. వారిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. అధికారిని కర్రతో కొట్టి చంపిన భీంకు 15 ఏళ్లు ఉండటం గమనార్హం. ఇదే ఆయన పోరాటానికి ఆరంభం.



తుడుం మోగించి.. ఒక్కటి చేసి



జోడేఘాట్‌కు వెళ్లే దారి

సాగు భూములపై హక్కులతో పాటు, పన్నుల రద్దు గురించి భీం 1938 నుంచి పోరాటం ఉద్ధృతం చేశారు. నిజాం తాలుకాదార్ అబ్దుల్ సత్తార్ (అప్పటి కలెక్టర్)తో నిర్వహించిన చర్చలు విఫలం కావడంతో.. ఉద్యమం క్రమంగా సాయుధ పోరాటంగా మారింది. ఈక్రమంలో కెరమెరి మండలంలోని టోకెన్ మోవాడ్, లైన్‌పటార్, బాబేఝరి, శివగూడ, పిట్టగూడ, కల్లెగాం, పట్నాపూర్, చాల్‌బడి, పాటగూడ, చిన్న పట్నాపూర్, గోండుగూడ, కొపగూడ గ్రామాల్లోని ప్రజలందరినీ ఏకం చేశారు. తుడుం మోగించి జోడేఘాట్ వద్ద సమావేశపర్చేవారు. వీరి సహకారంతో పోరు సాగుతున్న తరుణంలో ఆయనను ఎలాగైనా అణచివేయాలని నిజాం పోలీసులను రంగంలో దించారు. కుర్దు పటేల్ అనే నమ్మక ద్రోహి ఇచ్చిన సమాచారంతో భీం ఉన్న స్థలాన్ని పసిగట్టి కాల్పులు జరపగా.. 1940న తుదిశ్వాస విడిచారు.



మ్యూజియం

గిరిజన ప్రగతికి సంస్కరణలు..

భీం ప్రాణత్యాగంతో కళ్లు తెరిచిన నిజాం ఆదివాసీల అభ్యున్నతి కోసం సంస్కరణలు చేపట్టారు. ప్రఖ్యాత మానవ పరిణామ శాస్త్రవేత్త హైమన్ డార్ఫ్‌ను నియమించింది. గిరిజనులతో ఆయన మమేకమై వారి స్థితిగతులపై అధ్యయనం చేసి, అభివృద్ధికి మార్గనిర్దేశనం చేశారు. ఆయన సూచనలతోనే అటవీ భూమిని రెవెన్యూ భూమిగా మార్చుతూ ఉత్వర్వులు వచ్చాయి.

- జైనూర్ మండలం దబోలిలో 40వేల అటవీ భూముల పంపిణీ
- ఉమ్మడి జిల్లాలో 1.60 లక్షల ఎకరాలు గిరిజనులకు పంపిణీ
- గిరిజనుల భూ బదలాయింపు నిషేధిత చట్టం, గిరిజన ప్రాంతాల రెగ్యులరైజేషన్‌కు రూపకల్పన
- తిర్యాణి మండలంలో గిన్నెధరి, మర్లవాయిలో ఉపాధ్యాయ శిక్షణ కేంద్రాల ఏర్పాటు
- ఆదివాసీ ప్రాంతాల్లో 30 నూతన పాఠశాలల ఏర్పాటు
- గిరిజన తెగలు, గిరిజన ప్రాంతాలను నోటిఫైడ్‌గా ప్రకటన
- ఐటీడీఏలు, గిరిజన సహకార సంఘాల ఏర్పాటు



స్మృతివనం

ఏఈవోలకు తాఖీదులు


ఆదిలాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ విస్తరణ అధికారుల (ఏఈవో)పై ఉన్నతాధికారులు చర్యలకు ఉపక్రమించారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు డిజిటల్ సర్వే చేయాల్సిన ఏఈవోలు తమకు పని భారం అవుతుందని సర్వేకు దూరంగా ఉన్నారు. ఆగ్రహించిన ఉన్నతాధికారులు ఉమ్మడి జిల్లా మొత్తం ఏఈవోలకు మెమోలు జారీ చేశారు. డిజిటల్ సర్వే అంటే పంట పొలానికి వెళ్లి సంబంధిత వ్యవసాయ సిబ్బంది ఫొటో తీసి వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ఇందుకు సెల్‌ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించింది. ఇప్పటికే అనేక పనులతో తలమునకలై ఉన్నామని, ఈ పనికి సహాయకుడిగా మరో వ్యక్తిని నియమించాలని ఏఈవోలు కోరారు. ప్రభుత్వం ఒప్పుకోకపోగా.. డిజిటల్ సర్వేను పూర్తి చేయాలని తిరిగి ఆదేశించింది. అయినా సర్వే చేయడం కుదరదంటూ రాష్ట్ర వ్యాప్తంగా 15 రోజులుగా ఏఈవోలు సర్వేకు దూరంగా ఉన్నారు. సర్వే మినహా ఇతర పనులు పూర్తి చేస్తున్నా.. ప్రభుత్వ ఆదేశాలు పట్టించుకోకపోవడం, విధుల్లో నిర్లక్ష్యం చేశారంటూ.. అందరికి మెమోలు జారీ చేసింది.

పల్లెదారులకు రూ.15 కోట్లు మంజూరు

ఇంద్రవెల్లి, న్యూస్‌టుడే : రోడ్డు సౌకర్యం లేని గ్రామాలకు రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం రూ.15.07 కోట్లు మంజూరు చేసింది. ఖానాపూర్ నియోజకవర్గంలోని జన్నారం, ఉట్నూరు, ఖానాపూర్ మండలాల పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాలకు నిధులు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉట్నూరు మండలంలోని చాపరాల నుంచి మత్తడిగూడ వరకు 5 కి.మీ.ల రోడ్డు నిర్మాణానికి రూ.5.15 కోట్లు, శంభుగూడ నుంచి సుహినూర్ వరకు 3 కి.మీ రహదారికి రూ.3.24 కోట్లు, జన్నారం నుంచి నర్సింగాపూర్ వరకు 3 కి.మీ రోడ్డుకు రూ.2.94 కోట్లు, పీడబ్ల్యూడీ రహదారి నుంచి నర్సింగాపూర్‌కు రూ.2.50 కోట్లు, ఇదే రహదారిపై కల్వర్టులకు రూ.54 లక్షలు, ఖానాపూర్ మస్కపూర్ వయా చర్చి రోడ్డుకు రూ.70 లక్షలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు తెలిపారు.

సూర్యప్రతాపం


● ఉమ్మడి జిల్లాలో భిన్న వాతావరణం



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో వాతావరణంలో మార్పులతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. నైరుతి రుతుపవనాల కాలం పూర్తి అయినప్పటికీ మరో నెల రోజులపాటు ఈశాన్య రుతుపవనాల ప్రభావం కారణంగా వర్షాలు కురిసే అవకాశం ఉంది. అడపాదడపా జిల్లావ్యాప్తంగా రాత్రి కొన్ని ప్రాంతాల్లో జల్లులు కురుస్తున్నా పగటి ఉష్ణోగ్రతలు మాత్రం 35 నుంచి 40 డిగ్రీల నడుమ కొనసాగుతుండటం గమనార్హం. దీంతో మధ్యాహ్నం పూట బయటకు వెళ్లాలంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. జిల్లాలో విభిన్న వాతావరణ పరిస్థితులు ఆరోగ్యాల మీద ప్రభావాన్ని చూపుతున్నాయి. -న్యూస్‌టుడే, లక్షెట్టిపేట

మరో మూడు రోజులు ఇవే తిప్పలు

ఉదయం 9 గంటలు దాటిందంటే చాలు వేసవిని తలపిస్తూ భానుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. సాయంత్రం 4 గంటల వరకు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటోంది. దీనికి తోడు ఉక్కపోతతో జిల్లావాసులు సతమతం అవుతున్నారు. అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో చాలా జిల్లాలో వర్షాలు కురుస్తున్నప్పటికీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఎండల తీవ్రత కొనసాగనున్నట్లు వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. గడిచిన వారం రోజులుగా ఎండల తీవ్రత కొనసాగుతుండగా రానున్న మూడు రోజులపాటు కూడా జిల్లాలోని చాలా ప్రాంతాల్లో పగటి ఉష్ణోగ్రతలు 34 నుంచి 38 డిగ్రీల సెంటీగ్రేడ్‌ల మధ్య కొనసాగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



ఆరోగ్య సమస్యలు

అసాధారణ వాతావరణ పరిస్థితుల కారణంగా జిల్లావాసులు వివిధ రకాల ఆరోగ్య సమస్యల బారిన పడుతున్నారు. ఎండ తీవ్రత, ఉక్కబోత కారణంగా చర్మ సంబంధిత వ్యాధులు పీడిస్తున్నాయి. కొంత మంది ఒళ్లు, కండరాల నొప్పులతోపాటు గొంతు నొప్పి, శ్వాస సంబంధిత వ్యాధులతో బాధపడుతున్నారు.

14 రోజులు.. రూ.19.42 కోట్లు

● ఆర్టీసీకి దసరా, బతుకమ్మ పండగ సెలవుల్లో ఆదాయం



ఆర్టీసీ బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : దసరా, బతుకమ్మ పండగలు ఆర్టీసీకి కాసులు కురిపించాయి. విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించడం, ఉద్యోగులు, వ్యాపారులు సొంతూళ్లకు బయల్దేరేందుకు ఆర్టీసీ బస్సులను ఆశ్రయించడంతో సంస్థకు భారీగా ఆదాయం సమకూరింది. రీజియన్‌లోని ఆరు డిపోల నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా నడిచే బస్సులతో పాటు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడం కలిసివచ్చింది. ఈనెల 1 నుంచి 14 తేదీ వరకు రూ.19.42 కోట్ల ఆదాయం సమకూరింది. 12, 13 తేదీలలో వరుసగా రూ.72.70 లక్షలు, రూ.89.55 లక్షలు మినహాయిస్తే రోజూ సగటున రూ.1.38 కోట్ల ఆదాయం వచ్చింది. గతేడాది దసరా సీజన్‌లో 12 రోజుల్లో రూ.11.81 కోట్ల ఆదాయం వచ్చింది.

ఈ నెల 1 నుంచి 14 వరకు వివరాలు

డిపో	మొత్తం ప్రయాణికులు	మహాలక్ష్ములు	ఆదాయం (రూ.కోట్లలో)
ఆదిలాబాద్	7,05,631	3,77,368	4.02
భైంసా	5,95,744	3,56,985	1.99
నిర్మల్	8,80,500	5,73,128	4.96
ఉట్నూరు	1,95,237	1,21,929	0.90
ఆసిఫాబాద్	5,68,995	3,85,795	2.85
మంచిర్యాల	8,27,740	5,02,679	4.68

61 శాతం మహిళా ప్రయాణికులే

ఆదిలాబాద్ రీజియన్ పరిధిలోని ఆదిలాబాద్, ఉట్నూరు, నిర్మల్, భైంసా, ఆసిఫాబాద్, మంచిర్యాల డిపోలున్నాయి. ప్రత్యేకంగా హైదరాబాదుకు 412 బస్సులను ఏర్పాటు చేశారు. రీజియన్ వ్యాప్తంగా బస్సులను ప్రతిరోజు సగటున 2.45 లక్షల కిలోమీటర్ల మేర నడిపారు. 14 రోజుల్లో మొత్తంగా 34.34 లక్షల కిలోమీటర్ల మేర బస్సులను నడిచాయి. మొత్తంగా 37.73 లక్షల మంది ప్రయాణికులను గమ్యస్థానాలకు చేరవేశారు. అందులో ఛార్జీలు చెల్లించిన ప్రయాణికులు 14.55 లక్షల మంది కాగా మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించిన మహిళలు 23.17 లక్షల మంది కావడం గమనార్హం.

తిరుగు ప్రయాణానికి ఏర్పాట్లు

- సోలోమన్, రీజినల్ మేనేజరు, ఆర్టీసీ

దసరా, బతుకమ్మ పండగలకు ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశాం. సెలవులు ముగిసినందున తిరుగు ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా అన్ని డిపోల నుంచి బస్సులను నడుపుతున్నాం.